### దటీజ్ తెలంగాణ

సీఎంఆర్ఎఫ్ కింద 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ హయాంలో తెలంగాణలో కేవలం 50వేల మంది లబ్ధి పొందారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ స్కీమ్ ద్వారా ఇప్పటివరకు దాదాపు 8 లక్షలకుపైగా ఆపరేషన్లు చేయడంతో పాటు 14,39,240 మంది రోగులకు చికిత్స అందించారు.

సంక్షేమం



చేనేత కార్మికులు అప్పుల ఊబిలో కూరుకుపోకుండా వారికి ఆర్థిక భరోసా కల్పించాలన్న ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం చేనేత కార్మికుల రుణమాఫీని తీసుకొచ్చింది. దాదాపు రూ.16 కోట్ల విలువైన రుణాలను మాఫీచేసింది. 10,148 మంది లబ్ధి పొందారు.

చేనేతలకు రుణమాఫీ

పథకం ప్రారంభం 2018
లబ్ధిదారులు 10,148

## వ్యవసాయ ఉత్పత్తుల్లో వృద్ధి..



*తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి బహుముఖ అభివృద్ధిని సాధిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నది. ఉత్తమ ఫలితాలు సాధించినందుకు కేంద్రం ఎన్నో ర్యాంకులు, అవార్డులు, బహుమతులు ప్రకటిస్తుండడంతో ప్రభుత్వం అన్ని వర్గాల మన్ననలు పొందుతున్నది.*

ప్రభుత్వం వ్యవసాయరంగానికి ప్రాధాన్యమిస్తున్నది. పశు, మత్స్య సంపదను ప్రోత్సహించడం, గొర్రెల పంపిణీ పథకం మొదలైన కార్యక్రమాల వల్ల వ్యవసాయం, అనుబంధ రంగాల వాటా 2014-15లో 16.3% నుంచి 2022-23 నాటికి 18.2%కి పెరిగింది. నిరంతర నీటిపారుదల, పంటలకు ప్రధాన పెట్టుబడి. ఇది రుతుపవనాలపై ఆధారపడే రైతులను కాపాడుతున్నది.


**పంటల** ఉత్పత్తి, ఉత్పాదకత పెరుగుదలకు ఇది దారి తీస్తున్నది. 2014 నుంచి 2023 మధ్య కాలంలో సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం రూ.1.61 లక్షల కోట్లు వెచ్చించింది. ఈ గణనీయ పెట్టుబడి కారణంగా, స్థూల నీటిపారుదల ప్రాంతం 145% పెరిగింది. 2014-15లో 62.48 లక్షల ఎకరాలు ఉండగా, 2022-23 నాటికి 153.53 లక్షలకు చేరుకున్నది.

నీటిపారుదల రంగంలో అద్భుతమైన వృద్ధి ఫలితంగా 2015-16, 2021-22 మధ్య వరి ఉత్పత్తి 342%; 45.71 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 202 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగింది. తద్వారా భారత ఆహార సంస్థకు వరి సరఫరా చేసే రెండవ అతిపెద్ద రాష్ట్రంగా అవతరించింది. తెలంగాణ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ లిమిటెడ్ గత ఏడేండ్లలో కనీస మద్దతు ధర ఇచ్చి లక్షలాది మంది రైతుల నుంచి భారీ మొత్తంలో వరి కొనుగోలు చేసింది. రైతుల ఆదాయాన్ని పెంచే ఉద్దేశంతో ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తున్నది. ఎకరాల పరంగా చూసినపుడు, ఆయిల్ పామ్ పంట పండించే రాష్ట్రాల్లో తెలంగాణ 68,440 ఎకరాలతో ఆరవ స్థానంలో నిలిచింది.

నూనె వెలికితీతలో దేశంలో మొదటి, పండ్ల ఉత్పత్తిలో రెండవ రాష్ట్రంగా (19.32% వాటాతో) తెలంగాణ నిలిచింది. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు, ప్రభుత్వం యాంత్రీకరణ సాధనాలపై 50% ఆర్థిక సాయాన్ని అందిస్తున్నది. పంట మార్పిడి విధానంలో భాగంగా 20 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సేద్యం చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నది. అందుకోసం రాష్ట్రంలోని 11 కంపెనీలు 2.67 కోట్ల ఆయిల్ పామ్ మొక్కలను పెంచే సామర్థ్యంతో 30 నర్సరీలను ఏర్పాటు చేశాయి.

... భరద్వాజ

‘యుద్ధంలో గెలవడం అంటే శత్రువును చంపడం కాదు.. శత్రువును ఓడించడం’ జల్సా సినిమాలోని ఫేమస్ డైలాగ్ ఇది. రాజకీయాల్లో అపర చాణక్యుడు కేసీఆర్ కూడా సరిగ్గా ఇదే సూత్రాన్ని పాటిస్తారు. ‘ప్రజా క్షేత్రంలో యుద్ధం అంటే ప్రత్యర్థులను ఓడించడం కాదు.. మనం గెలవడం.. ప్రత్యర్థుల మనసులను గెలవడం’ అంటారాయన. దశాబ్దాల తన రాజకీయ జీవితంలో కేసీఆర్ ఎందరో హేమాహేమీలను మట్టికరిపించారు.. మరెందరినో తనతో కలుపుకొన్నారు.. నాడు తనతో పాటు ఉద్యమంలో నడిచేలా చేశారు.. నేడు తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములయ్యేలా చేస్తున్నారు.



# నాడు ప్రత్యర్థులు నేడు ఫాలోవర్లు..

### కేసీఆర్‌తో తలబడి.. ఆయన వెంట నిలబడి

### అధినేతకు జై కొట్టిన హేమాహేమీలు

**కేసీఆర్** గెలుపును చూసి ప్రత్యర్థులు సైతం ఆయనకు జై కొట్టాల్సిందే. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్‌పై పోటీ చేసిన వారిలో ఎనిమిది మంది మహామహులు ఆ తర్వాత కేసీఆర్‌తో కలిసిపోయారు. కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ (టీఆర్ఎస్) పార్టీలో చేరి తెలంగాణ అభివృద్ధి, సంక్షేమంలో తమవంతు పాత్ర పోషిస్తున్నారు. వారేమి ఆశామాషీ వ్యక్తులు కాదు. రాజకీయాల్లో అందరూ తమదైన ముద్ర వేసినవారే. 1983లో సిద్దిపేట బీజేపీ అభ్యర్థిగా కేసీఆర్‌పై పోటీ చేసిన నిమ్మ నర్సింహారెడ్డి నుంచి మొదలుకొని 2018లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన వంటేరు ప్రతాప్‌రెడ్డి వరకు అందరూ కేసీఆర్‌తో కలిసి నడుస్తున్నారు.

**■ నిమ్మ నర్సింహారెడ్డి...**

**1983లో** సిద్దిపేట నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా నిమ్మ నర్సింహారెడ్డి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన కేసీఆర్.. కాంగ్రెస్ అభ్యర్థి, తన రాజకీయ గురువు అనంతుల మదన్‌మోహన్ చేతిలో స్వల్ప తేడాతో పరాజయం పాలయ్యారు. అనంతర కాలంలో తెలంగాణ సాధన కోసం నిమ్మ నర్సింహారెడ్డి సైతం కేసీఆర్ వెంట నడిచారు. టీఆర్ఎస్ పార్టీ పురుడు పోసుకున్నప్పుడు కేసీఆర్‌తో పాటు ఉన్న కొద్దిమంది మిత్రులు, మేధావుల్లో నిమ్మ నర్సింహారెడ్డి కూడా ఒకరు.

**■ మారెడ్డి శ్రీనివాసరెడ్డి**

**తెలంగాణ** ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ టీడీపీ సభ్యత్వానికి, శాసనసభకు, డిప్యూటీ స్పీకర్ పదవికి కేసీఆర్ రాజీనామా చేశారు. దీంతో 2001లో సిద్దిపేట ఉప ఎన్నికలో టీడీపీ అభ్యర్థి మారెడ్డి శ్రీనివాసరెడ్డిపై ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలోకి దిగిన కేసీఆర్ ఘన విజయం సాధించారు. ఆ తర్వాత కొద్దికాలానికే మారెడ్డి శ్రీనివాసరెడ్డి బీఆర్ఎస్ (టీఆర్ఎస్)లో చేరారు.

**■ జిల్లా శ్రీనివాస్**

**టీఆర్ఎస్‌ను** స్థాపించిన తర్వాత 2004లో సిద్దిపేట నుంచి కేసీఆర్ పోటీ చేయగా.. టీడీపీ అభ్యర్థిగా జిల్లా శ్రీనివాస్ బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో కేసీఆర్ 44,668 భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఆ తర్వాత జిల్లా శ్రీనివాస్ టీఆర్ఎస్‌లో చేరారు.

**■ ఎం స్వామిచరణ్**

**1999లో** సిద్దిపేట నుంచి కాంగ్రెస్ తరపున ఎం స్వామిచరణ్ పోటీ చేశారు. ఆయనపై కేసీఆర్ 27,555 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. మలిదశ ఉద్యమం మొదలయ్యాక టీఆర్ఎస్‌లో చేరారు.

**■ వంటేరు ప్రతాప్ రెడ్డి**

**2014, 2018లోనూ** గజ్వేల్‌లో కేసీఆర్‌పై పోటీ చేసిన వంటేరు ప్రతాప్‌రెడ్డి 2019లో టీఆర్ఎస్‌లో చేరారు. ప్రతాప్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా కేసీఆర్ నియమించారు.

**■ చాగన్ల నరేంద్రనాథ్**

2014లో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కేసీఆర్‌పై బీజేపీ తరపున చాగన్ల నరేంద్రనాథ్ బరిలో నిలిచారు.. ఆ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. అనంతరం టీఆర్ఎస్‌లో చేరారు.

... సూర్యకిరణ్ తోగటి

**■ ఎల్ రమణ**

2006లో టీఆర్ఎస్ పార్లమెంట్ సభ్యులు తమ పదవులకు రాజీనామా చేయగా కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో కేసీఆర్‌పై టీడీపీ అభ్యర్థిగా సీనియర్ నేత ఎల్ రమణ బరిలోకి దిగారు. ఈ ఎన్నికల్లో కేసీఆర్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. 2,10,582 ఓట్ల మెజారిటీతో ఆయన విజయం సాధించారు. 2021లో బీఆర్ఎస్‌లో చేరిన ఎల్ రమణకు కేసీఆర్ ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు.

### షహర్ కీ బాత్

## శాంతిభద్రతల పరిరక్షణలో పర్‌ఫెక్ట్



సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు షిఫ్టుల వారీగా విధులు ఉంటాయి. పని ముగించుకొని అర్ధరాత్రుళ్లు ఇంటికి వెళ్లాలంటే భయాందోళనకు గురయ్యేవాళ్లం. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత అప్పటి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సీఎం కేసీఆర్ విజన్‌తో ఎలాంటి ఆటంకాలు లేకుండా హైదరాబాద్‌లో నివసిస్తున్నాం. ఎంతటి రాత్రయినా ఇంటికి క్షేమంగా చేరుకుంటున్నాం. ఇంతటి ప్రశాంత వాతావరణం దేశంలో ఎక్కడా లేదనిపిస్తుంది. ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, నోయిడా వంటి నగరాల్లో టెకీలపై నిత్యం అనేక దురాగతాలు జరుగుతున్నాయి. తెలంగాణ వంటి ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థ దేశమంతా రావాలి. మెట్రోనగరాల్లో సురక్షితమైనది, అత్యంత నివాసయోగ్యమైనది అనగానే మొట్టమొదటగా గుర్తుకొచ్చేది భాగ్యనగరమే.

**-సజిత్ రంజన్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, కేరళ**

## ఉపాధి, ఉద్యోగాలకు నెలవు హైదరాబాద్



**ఉపాధి,** ఉద్యోగాలకు హైదరాబాద్ నెలవుగా మారింది. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఉత్తరాది నుంచి తెలంగాణకు వలసలు పెరిగాయి. ఉత్తర్ ప్రదేశ్ నుంచే మా బంధువులు అనేక మంది ఉపాధి కోసం నగరానికి వచ్చారు. గతంలో కూలీలు, నిర్మాణ రంగం కార్మికులు, యువత ఇక్కడికి వచ్చి పనులు చేసుకొని తిరిగి వెళ్లిపోయేవారు. కానీ ప్రస్తుతం వచ్చినవారంతా ఇక్కడే స్థిరపడిపోతున్నారు. ఇక్కడి వాతావరణం, జీవన విధానం బాగుంటుంది. నేను 15 ఏండ్ల నుంచి హైదరాబాద్‌లో చిరుద్యోగిగా పనిచేస్తూ.. కుటుంబంతో నివసిస్తున్నాను. ఇప్పటి వరకు ఇంత అభివృద్ధి చేసిన నాయకుడిని ఎక్కడా చూడలేదు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందన్న నమ్మకం నాకున్నది.

**- రాజు యాదవ్**
**ఉత్తర్‌ప్రదేశ్ వాసి**

### సోషల్ యాంగిల్

## హ్యాట్రిక్ హిట్!

పాట మొదలయ్యింది
ఆట మొదలయ్యింది
తెలంగాణ వచ్చింది
జనం గొంతు పిలిచింది...
**ఒకటోస్సారి...**
కరెంటు కోతలు ఆగినయ్
చెర్ల మత్తళ్లు దుంకినయ్...
నల్లా నీళ్లు పొంగినయ్...
ఊరి బాటలు మెరిసినయ్...
మరో గొంతు వినబడింది...
**రెండోస్సారీ...**
రైతుబంధు బంధువయ్యింది
కంటి వెలుగు చేరువయ్యింది
కాళేశ్వరం వరమయ్యింది
రైతు ఇంట పండుగయ్యింది...
**మూడోస్సారీ...**
మరో గొంతు పిలుస్తున్నది
అభివృద్ధిని తలుస్తున్నది
స్వరాష్ట్ర జయకేతనాన్ని
పదిలంగా మలుస్తున్నది.
జయధ్వానం
ఇది సత్యం
ఇది తథ్యం!

■ అనన్య



# చెరువులకు కళ.. సాగు భళా

ప్రభుత్వ దవాఖానల్లో అత్యాధునిక సౌకర్యాలు
మిషన్ కాకతీయతో చెరువులకు జలకళ
రోడ్ల విస్తరణతో సాఫీగా ప్రయాణం
మంత్రి కేటీఆర్ దత్తతతో కొడంగల్‌కు మహర్దశ

**■ పరియల్ వ్యూ: కొడంగల్**

*కొడంగల్ నియోజకవర్గంపై సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రత్యేకంగా దృష్టి సారించడంతో అభివృద్ధి పథంలో దూసుకెళుతున్నది. 2018 ఎన్నికల్లో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి విజయం సాధించిన తరువాత కొడంగల్‌ను మంత్రి కేటీఆర్ దత్తత తీసుకోవడంతో గడిచిన ఐదేండ్లలో మొత్తంగా రూ.2 వేల కోట్ల నిధులు మంజూరు చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దారు.*



నియోజకవర్గంలో కొడంగల్, కోస్గి రెండు మున్సిపాలిటీలు ఏర్పాటయ్యాయి. మున్సిపాలిటీల తొలి దశ అభివృద్ధిలో భాగంగా కొడంగల్‌కు రూ.15 కోట్లు, కోస్గికి రూ.15 కోట్లు మంజూరు చేశారు. దీంతో ఆయా మున్సిపాలిటీల పరిధిలోని పలు వార్డుల్లో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం, శ్మశానవాటికలు తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. మలి దశ అభివృద్ధిలో భాగంగా రెండు మున్సిపాలిటీలకు రూ.20 కోట్లు మంజూరు కావడంతో పనులు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ నిధులకు తోడు మరో రూ.30 కోట్లు మంజూరు చేయడంతో అభివృద్ధి పనులు మరింత ఊపందుకున్నాయి.

**ప్రభుత్వ దవాఖానలకు మహర్దశ**

ప్రజలకు కార్పొరేట్ తరహాలో వైద్య సేవలు అందించే దిశగా ప్రభుత్వం శ్రీకారం చుట్టిన నేపథ్యంలో రూ.19 కోట్ల నిధులతో కొడంగల్, కోస్గి, మద్దూర్ మండలాల్లో అధునాతన దవాఖాన భవనాలు రూపుదిద్దుకొన్నాయి. కొడంగల్ సివిల్ దవాఖానను రూ.5.50 కోట్లతో అన్ని హంగులతో 50 పడకల భవనంగా నిర్మించారు. రూ.కోటి నిధులతో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. రూ. కోటి నిధులను కేటాయించడంతో కొత్త మార్చురీ భవనం, ఆసుపత్రి చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు.



కోస్గిలో 50 పడకల దవాఖాన

**రోజు కోటీ 90 లక్షల లీటర్లు**

మిషన్ భగీరథ ద్వారా నియోజకవర్గంలోని 220 గ్రామాల్లో ప్రతిరోజు కోటీ 90 లక్షల లీటర్ల తాగునీటి సరఫరా కొనసాగుతున్నది. మిషన్ భగీరథ ఏర్పాటుకు రూ.167 కోట్ల అంచనాతో గ్రిడ్ పనులు చేపట్టారు. గ్రామాల్లో ట్యాంకులు, పైప్‌లైన్లు, ఇంటింటికీ నీటి సరఫరా కోసం నల్లాల ఏర్పాటు వంటి పనుల నిర్వహణకు రూ.17 కోట్లు ఖర్చు చేశారు. కొడంగల్ పట్టణ శివారులోని సిద్ధినాంపు ప్రాంతంలో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి కేంద్రంలో ప్రతిరోజూ 23 మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేస్తున్నారు.

**మెరుగైన మౌలిక వసతులు..**

దాదాపు రూ.400 కోట్ల నిధులతో గ్రామగ్రామానికి లింక్ రోడ్లు పూర్తి కావడంతో ప్రజలు సాఫీగా ప్రయాణాలు చేస్తున్నారు. గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుల వేతనాలు పెంచడంతో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ మెరుగుపడి పల్లెలు స్వచ్ఛతకు మారుపేరుగా నిలుస్తున్నాయి.

| | | | |
|---|---|---|---|
| కొడంగల్‌లో 50 పడకల దవాఖాన | మున్సిపాలిటీల అభివృద్ధి 80 రూ కోట్లు | ₹167 కోట్లతో మిషన్ భగీరథ గ్రిడ్ | |
| | | మిషన్ కాకతీయ రూ.39 కోట్లు | 17 చెక్ డ్యాంలు రూ.60 కోట్లు |
| రోడ్ల విస్తరణ రూ.13 కోట్లు | లింకు రోడ్లు రూ.400 కోట్లు | విద్యారంగం: రూ.20 కోట్లు | |

**140 చెరువుల్లో పూడికతీత**

మిషన్ కాకతీయ కింద కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల పరిధిలో రూ.39 కోట్లతో 140 చెరువులు, కుంటల్లో పూడిక పనులు చేపట్టారు. దీంతో నియోజకవర్గంలో 56,425 ఎకరాలు సాగవుతున్నది. కొడంగల్ పెద్ద చెరువు సుందరీకరణకు రూ. కోటీ 60 లక్షలు మంజూరయ్యాయి. బొంరాస్‌పేట, తుంకిమెట్ల, మహంతిపూర్ గ్రామాల్లో రూ.60 కోట్లతో 17 చెక్ డ్యాంల నిర్మించారు. కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల కింద నియోజకవర్గ పరిధిలో 1 లక్షా 20 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు కాలువ నిర్మాణానికి టెండర్ ప్రక్రియ చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది.

**రోడ్ల విస్తరణ**

నియోజకవర్గంలోని మద్దూర్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల్లో రోడ్ల వెడల్పుతో పాటు సెంట్రల్ లైటింగ్‌కు రూ.13 కోట్లు మంజూరయ్యాయి. కొడంగల్ మండలం పోచమ్మతండా గ్రామ పంచాయతీ పరిధిలోని మైసమ్మతండాకు వెళ్లే దారిలో ఉన్న వాగుతో పోచమ్మ, మైసమ్మతండాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడేవి. ఏండ్ల నుంచి రెండు తండాల వాసులు అష్టకష్టాలు పడుతూ కాలాన్ని వెళ్లదీశారు. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ప్రత్యేకంగా చొరవ తీసుకొని రూ.50 లక్షలు మంజూరు చేయించడంతో బ్రిడ్జి నిర్మాణం జరిగింది. ప్రస్తుతం పనులు పూర్తయి, ప్రారంభానికి సిద్ధంగా ఉన్నది.

**విద్యకు ప్రాధాన్యం**

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాలల భవనాల నిర్మాణం కోసం రూ.20 కోట్లు మంజూరయ్యాయి. కొడంగల్ పట్టణ పరిధిలోని బండల ఎల్లమ్మ దేవాలయ సమీపంలో రూ.4 కోట్ల 57 లక్షలతో డిగ్రీ కళాశాల నూతన భవనం, రూ.2 కోట్లతో కస్తూర్బా గాంధీ కళాశాల భవనాన్ని నిర్మించారు. మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్ ప్రాంతంలో రూ.4 కోట్ల 20 లక్షలతో ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను నిర్మించారు.

**ఆలయాల అభివృద్ధి.**

నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.6 కోట్లు మంజూరు చేసింది. కొడంగల్‌లో శ్రీ మహాలక్ష్మీవేంకటేశ్వరస్వామి, దౌల్తాబాద్‌లో శ్రీ వేంకటేశ్వరస్వామి, మద్దూర్‌లోని బావోజీ, బొంరాస్‌పేట, కోస్గిలో కూడా పలు ఆలయాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

## ■ నగరంలో తొలి అండర్ పాస్...



వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం (ఎస్ఆర్‌డీపీ) కింద శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధి మాదాపూర్ అయ్యప్పసొసైటీ వద్ద 2018లో రాష్ట్ర ప్రభుత్వం అండర్ పాస్‌ను నిర్మించింది. రూ.44కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ అండర్ పాస్ బల్దియాలోనే మొదటిది కావడం విశేషం. ఆ తర్వాత రూ. 55 కోట్లతో మైండ్‌స్పేస్ జంక్షన్, రూ. 263 కోట్లతో కొత్తగూడ ఫ్లై ఓవర్‌తో పాటు అండర్ పాస్‌ను నిర్మించి అందుబాటులోకి తెచ్చింది. వీటి నిర్మాణంతో హైటెక్ సిటీతో పాటు ఐటీ కారిడార్ మొత్తానికి రవాణా వ్యవస్థ మెరుగుపడింది. సిగ్నళ్లు, ట్రాఫిక్ జామ్‌లతో ఇబ్బంది లేకుండా స్వల్పవ్యవధిలోనే గమ్య స్థానాలకు చేరుకుంటున్నామని వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**-మియాపూర్**